రంగంలోకి సీఐడీ !


తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో డీటీని విచారిస్తున్న సీఐడీ అధికారులు

తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో విచారణ

ఓటర్ల నమోదులో అక్రమాలపై ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు పర్యవసానం

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో, తుడా కార్యాలయాల్లో సీఐడీ అధికారులు మంగళవారం విచారణ జరపడం కలకలం రేపింది.చంద్రగిరి నియోజకవర్గంలో చేపట్టిన ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే పులివర్తి నానీ చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగిన సీఐడీ అధికారుల బృందం విచారణ చేపట్టింది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల నమోదులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచీ అసంఖ్యాకంగా ఫిర్యాదులందాయి. కలెక్టర్ మొదలుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ దాకా ఫిర్యాదులు వెళ్ళాయి. తిరుపతి ఆర్డీవో నుంచీ కిందిస్థాయిలో బీఎల్వోల దాకా అధికారులు, సిబ్బంది అప్పటి అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా పనిచేశారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దొంగ ఓట్లు భారీగా చేర్పించారని, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించారని ఆధారాలు కూడా జత చేశారు. అయితే ప్రభుత్వం వీటిపై స్పందించలేదు. ఎన్నికల సంఘం వివరణ కోరినా అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపుచ్చారనే ఆరోపణలున్నాయి. ఎన్నికలు ముగిశాక ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీ మళ్ళీ దీనిపై ప్రభుత్వానికి, సీఐడీ విభాగానికీ ఫిర్యాదు చేశారు. ప్రత్యేకించి గూడూరు ఆర్డీవో మీసాల కిరణ్ కుమార్ ప్రమేయంపై ఆరోపణలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి రూరల్ తహసిల్దారుగా పనిచేసిన ఆయన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో అంటకాగారనే ఆరోపణలున్నాయి. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చాక ప్రభుత్వ విప్ హోదాలో చెవిరెడ్డికి ఓఎస్డీగా నియమితులయ్యారు.తర్వాత గూడూరు ఆర్డీవోగా నియమితులయ్యారు. గూడూరు ఆర్డీవోగా పనిచేస్తూనే వారంలో ఐదు రోజుల పాటు తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో వున్న చెవిరెడ్డి వ్యక్తిగత కార్యాలయంలో మకాం వేసేవారని, చంద్రగిరి పరిధిలోని ఆరు మండలాల తహసిల్దార్లను, తిరుపతి ఆర్డీవోను అక్కడికి పిలిపించుకుని బోగస్ ఓటర్లను చేర్పించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్డీవో, తహసిల్దార్ల లాగిన్ల పాస్‌వర్డులు తీసుకుని బోగస్ ఓటర్లను చేర్పించడం, టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడం చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్డీవో కార్యాలయంలో రికార్డుల స్వాధీనం

ఎమ్మెల్యే నానీ ఫిర్యాదు నేపథ్యంలో తిరుపతి సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామ్‌కిషోర్, ఎస్ఐ మంజుల, సిబ్బంది మంగళవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. అయితే ఆ సమయానికి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కార్యాలయంలో లేరు. కార్యాలయ ఏవో, ఎన్నికల డీటీలను విచారించిన సీఐడీ అధికారులు ఎన్నికలకు సంబంధించిన కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్డీవో కలెక్టరేట్‌కు వెళ్ళారని, సాయంత్రం వస్తారని సిబ్బంది చెప్పడంతో సీఐడీ అధికారులు మళ్ళీ సాయంత్రం కార్యాలయానికి వెళ్ళారు. అయితే అప్పుడు కూడా ఆర్డీవో లేరు. క్యాంపు వెళ్ళారని, బుధవారం సెలవు కనుక గురువారం అందుబాటులో వుంటారని సిబ్బంది చెప్పారు. దీంతో గత ఐదేళ్ళలో తిరుపతి ఆర్డీవోలుగా పనిచేసిన అధికారులు, డివిజన్ పరిధిలో పనిచేసిన తహసిల్దార్లు, ఎన్నికల డీటీలు, బీఎల్వోలు, ఆర్డీవో, తహసిల్దారు కార్యాలయాల్లో పనిచేసిన ఎన్నికల సిబ్బంది ఎవరనే వివరాలు అందజేయాలని సీఐడీ అధికారులు కార్యాలయ ఏవోకు లేఖ అందజేశారు. చెవిరెడ్డి ఓఎస్డీగా కిరణ్‌కుమార్ తుడా వ్యవహారాల్లో ఏవైనా జోక్యం చేసుకున్నారా? నిధుల దుర్వినియోగంలో ఆయన ప్రమేయం ఏమైనా వుందా? అన్న కోణంలో విచారించేందుకు తుడా కార్యాలయానికి వెళ్ళారు. అక్కడ తుడా వీసీ వెంకట నారాయణను విచారించారు. అయితే చెవిరెడ్డికి ప్రభుత్వ విప్ హోదాలో కిరణ్‌కుమార్ ఓఎస్డీగా పనిచేశారు తప్ప తుడాతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని, తుడా వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఏమీ లేదని వీసీ సమాధానమిచ్చినట్టు తెలిసింది.


తుడా కార్యాలయంలో వీసీతో చర్చిస్తున్న సీఐడీ బృందం

రేపు తిరుపతి ఆర్డీవోను విచారించే అవకాశం?

తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి మంగళవారం అందుబాటులో లేకపోవడంతో గురువారం ఆయనను సీఐడీ అధికారులు విచారించే అవకాశం వుంది. అయితే గురువారం అయినా ఆయన అందుబాటులోకి వస్తారా లేదా? అందుబాటులోకి రాకుంటే సీఐడీ అధికారులు ఏం చేస్తారన్నది వేచి చూడాల్సి వుంది. కాగా చంద్రగిరి నియోజకవర్గంలో బోగస్ ఓటర్లను పెద్ద సంఖ్యలో చేర్పించారనే ఫిర్యాదుల నేపథ్యంలో సీఐడీ అధికారుల విచారణ మొదలు కావడంతో ఎన్నికల విధుల్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు హడలిపోతున్నారు. తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందో, తమపై ఏం చర్యలు వుంటాయోనని ఆందోళనకు లోనవుతున్నారు.

టీటీడీ జేఈవోగా వెంకయ్య చౌదరి



తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారిగా సీహెచ్ వెంకయ్య చౌదరి నియమితులయ్యారు.2005వ సంవత్సరం బ్యాచ్ ఐఆర్‌ఎస్ అధికారైన వెంకయ్య చౌదరిని డిప్యుటేషన్‌పై పంపాలన్న రాష్ట్రప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో ఆయన మూడేళ్ల పాటు ఏపీలో పనిచేయనున్నారు. గతంలో ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీగా వెంకయ్య చౌదరి పనిచేశారు. సాధారణంగా టీటీడీకి ఈవోతో పాటు తిరుమలకు ఒకరు, తిరుపతికి ఒకరు చొప్పున ఇద్దరు జేఈవోలుంటారు. కానీ, గత వైసీపీ ప్రభుత్వం ఇద్దరు జేఈవోలను తిరుపతికే పరిమితం చేసి తిరుమలలో కేవలం ఈవోగా ధర్మారెడ్డిని మాత్రమే కొనసాగించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పూర్వపు పద్ధతిలోనే ఈవోతో పాటు తిరుమలకు జేఈవోను యధావిధిగా కొనసాగిస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.సమర్థవంతమైన అధికారిగా పేరున్న వెంకయ్య చౌదరి ఎంట్రీతో టీటీడీలో ఎలాంటి మార్పులు, ఉంటాయో చూడాల్సివుంది.

జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని ఈ ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, కుటుంబసభ్యులకు రూ.2లక్షల విలువైన వైద్య సేవలు అందుతాయన్నారు. ఏడాదిలో ఎన్నిసార్లయినా పరిమితులు లేకుండా సదుపాయం వర్తిస్తుందన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఆదాయ పరిమితి లేకుండా నిర్దేశిత చికిత్సలకు ఉచిత ఓపీ సేవలు పొందవచ్చన్నారు. పథకానికి డాక్టర్ నందమూరి తారకరామావు వైద్యసేవ ట్రస్టు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా ,సమాచార పౌరసరఫరాల శాఖ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

23 కిలోల గంజాయి స్వాధీనం

● తమిళనాడుకు తరలిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్టు


సీజ్ చేసిన గంజాయి మూటలను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం),జూలై 16 : అనకాపల్లి నుంచి గూడూరు మీదుగా చెన్నైకి తరలిస్తున్న 23.5 కిలోల గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.తిరుపతిలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. చెన్నైకి చెందిన సెల్వం గోకుల్, శరవణన్ అభిషేక్, రాజ్ తమిళసెల్వం, శివ కొంతకాలంగా అనకాపల్లి నుంచి చెన్నైకి గంజాయి తరలిస్తున్నారు.గూడూరులోని రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద మంగళవారం డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి, వన్‌టౌన్ సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి తదితరులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారి వద్ద దాదాపు రూ 1.70 లక్షల విలువ చేసే 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. గంజాయి విక్రయించినా, తరలించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు కూడా గంజాయి నివారణకు సహకరించాలని ఎవరైనా విక్రయిస్తుంటే వెంటనే పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీఆర్ బాండ్లపై సందేహాలు తీర్చండి

● అధికారులకు మేయర్ ఆదేశాలు ● నగర సమస్యలు, కౌన్సిల్ అంశాలపై సమీక్ష
● పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచన


సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్లలో ఇళ్లు, స్థలాలు పోగొట్టుకున్న భూ యజమానులకు ఇచ్చే టీడీఆర్ బాండ్ల విషయమై కార్పొరేటర్లతో పాటు ప్రజలకున్న అనేక సందేహాలను నివృత్తి చేయాలని మేయర్ డాక్టర్ శిరీష అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అర్హులకు టీడీఆర్ బాండ్లు జారీ చేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కమిషనర్‌తో పాటు అన్ని విభాగాల అధిపతులతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. నగర సమస్యలతో పాటు గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన అంశాలపై ఎంతవరకు చర్యలు తీసుకున్నారో సుదీర్ఘంగా చర్చించారు. తీర్మానాలను అమలుపరిచేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వార్డుల్లో సమస్యలపై కార్పొరేటర్లు ప్రస్తావించిన సమస్యలకు సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలపై రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు.వర్షాలు పడుతున్నందున రోడ్లు, పరిశుభ్రత, పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ముఖ్యంగా వర్షాల వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, ప్రత్యేకించి యాత్రికులకు , నగర ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలన్నారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ విషయంలో టీటీడీ అధికారుల సహకారం తీసుకోవాలనుకుంటే తగిన నివేదిక ఇవ్వాలని, ఎమ్మెల్యే సహకారంతో ఈవోను సంప్రదిద్దామన్నారు. కూడలి ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే నగరంలో యూడీఎస్‌ను ఆధునికీకరించేందుకు అంచనాలతో నివేదికలు సమర్పించాలని కోరారని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.డబుల్ డెక్కర్ బస్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గానూ ఆర్టీసీకి అప్పగించేందుకు సమావేశం ఏర్పాటుచేయాలన్నారు. కమిషనర్ అదితి సింగ్, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ మోహన్, డీసీపీ శ్రీనివాసులురెడ్డి, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్‌వో యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఆర్ఎఫ్‌వో శ్రీనివాసరావు, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, ఆర్వోలు వర్మ, సేతుమాధవ్, శానిటరీ సూపర్ వైజరు చెంచయ్య తదితరులు హాజరయ్యారు.


స్టేట్ ఫస్ట్, సెకండ్ ర్యాంకర్లు చిత్ర శుక్లా,కావేరీ శుక్లా

ఏపీఆర్‌సెట్‌లో పద్మావతి వర్సిటీ ప్రతిభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16: ఏపీఆర్‌సెట్ లా సబ్జెక్టులో పద్మావతి యూనివర్సిటీ లా విద్యార్థినులు చిత్ర శుక్లా, కావేరీ శుక్లా స్టేట్ ప్రతిభ కనబరిచారు. చిత్ర శుక్లా 136 మార్కులతో 1 వ ర్యాంకు, కావేరి శుక్లా 136 మార్కులతో 2 వ ర్యాంకు సాధించారు. వీరిద్దరూ ప్రస్తుతం ఎల్ఎల్ఎం 4వ సెమిస్టర్ చదువుతున్నారు. వీరిని యూనివర్సిటీ ఉన్నతాధికారులు, లా విభాగ అధ్యాపకులు అభినందించారు.

రెండు హోటళ్ల సీజ్

నాయుడుపేట, జూలై 16:నాయుడుపేట పట్టణంలోని హోటళ్లు, దాబాల్లో మంగళవారం ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి జి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నర్మద తదితరులు పట్టణంలోని పలు హోటళ్లు, దాబాలలో ఆహార పదార్థాలను, పరిసరాల పరిశుభ్రతను, వంటకు వినియోగించే వస్తువుల నాణ్యతను పరిశీలించారు. హోటల్ అమరావతిలో వంట గది పరిశుభ్రంగా లేదని, తిరుమల హోటల్‌లో వంట గది పరిశుభ్రంగా లేకపోవడంతో పాటు కాలం చెల్లిన ఆహార పదార్థాలు వాడుతున్నారని సీజ్ చేసినట్లు కమిషనర్ జనార్దన రెడ్డి తెలిపారు. మిగిలిన హోటళ్లను, దాబాలను పరిశీలించి ఫుడ్ సేఫ్టీ నియమాల మేరకు వంటకు నాణ్యమైన సరుకులనే వాడాలని, వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరించారు.


హోటల్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

పుష్పపల్లకిలో మురిపించిన మలయప్ప

శ్రీరంగం సారె సమర్పణలో కొంత గందరగోళం







తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆణివార ఆస్థానం సందర్భంగా మంగళవారం సాయంత్రం తిరుమలలో పుష్పపల్లకి సేవ కన్నులపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకిపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు.ఆరురకాల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల స్వదేశీ, విదేశీ కట్‌ఫ్లవర్స్‌తో కలిసి మొత్తం టన్ను బరువు కలిగిన పుష్పాలను స్వామివారి పల్లకి అలంకరణకు వినియోగించారు. కృత, త్రేతా, ద్వాపర యుగాలకు చెందిన వివిధ దేవతామూర్తుల ప్రతిమలను పల్లకీకి ఏర్పాటు చేశారు. కాగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం రంగనాథస్వామి ఆలయం నుంచి శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న పెద్దజీయర్ మఠంలో శ్రీవారిసారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి తమిళనాడు దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కలిసి పట్టువస్త్రాలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లి శ్రీవారికి సమర్పించారు. కాగా సారెను ఆలయంలోకి తీసుకెళ్లే సమయంలో మహద్వారం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. తొలుత సారెతో పాటు పదిమందికి అనుమతి ఇచ్చారు. ఈక్రమంలో శ్రీవారి ఆలయ జీయర్‌స్వామి, మంత్రి శేఖర్‌బాబుతో పాటు పదిమంది మహద్వారం గేటులోకి ప్రవేశించగానే భద్రతాసిబ్బంది గేటు మూసివేశారు. దీంతో దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్ దంపతులు ఆలయం వెలుపలే ఉండిపోవాల్సి వచ్చింది.మంత్రి శేఖర్‌బాబు గుర్తించి తిరిగి గేటు వద్దకు చేరుకుని ఆలయంలోకి అనుమతించాలని విన్నవించారు. అనంతరం కుమార గురుబాలన్‌ను మహద్వారం నుంచి అనుమతించి ఆయన సతీమణిని బయోమెట్రిక్ నుంచి అనుమతించారు. శ్రీరంగ నుంచి వచ్చిన వారిలో ఇద్దరు ముందుగా మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లడంతో సమస్య తలెత్తినట్టు అధికారులు గుర్తించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.72 కోట్లు

తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.72 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 75,054 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,239 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో...


హర్షవర్ధనరాజు, నరసింహకిషోర్

ఇటీవల తిరుపతి జిల్లా, టీటీడీ నుంచి బదిలీ అయిన ఎస్పీ హర్షవర్ధన రాజు, సీవీఎస్వో నరసింహకిషోర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బదిలీ అయిన తమ స్థానాలకు వెళ్లే ముందు మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆలయంలోకి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు


ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

భాకరాపేట, జూలై 16: భాకరపేట చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లకు మంగళవారం పూజలు నిర్వహించి ఊరేగించారు. హిందూ, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముతవల్లి షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణ కార్డులు తప్పనిసరిగా ఇవ్వండి


తిరుమలనగర్‌లో హెల్త్‌సెంటర్‌ను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, జూలై 16: వైద్య సిబ్బంది గర్భిణులకు మాతా శిశు సంరక్షణ కార్డులను తప్పనిసరిగా ఇవ్వాలని డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ హెల్త్ సెంటర్‌లో జిల్లా టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు పరిశీలించారు. గర్భిణుల రికార్డులను తనిఖీ చేశారు. వారితో నేరుగా ముఖాముఖి నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులకు అందించే మాతా శిశు సంరక్షణ కార్డులో ప్రభుత్వం అందజేసే సేవలను తప్పనిసరిగా నమోదు చేయాలని వైద్యసిబ్బందికి తెలిపారు. టాస్క్‌ఫోర్సు సభ్యులు గణాంక అధికారి నాగేంద్రకుమార్, డీపీహెచ్ ఎంవోపీ జేబీరాణి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ప్రకాష్, మంగళం పీహెచ్‌సీ వైద్యాధికారిణి జయంతి, సీహెచ్‌వో అమరావతి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమల బాలగంగమ్మ జాతర



తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని బాలగంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. మాధవనిలయం (పీఏసీ-2) వద్దనున్న ఈ ఆలయంలో ప్రతి ఏడాది స్థానికులు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా కార్యనిర్వాహకులు దయా నాయుడు, విజయ నాయుడు, కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయాన్ని అందంగా అలంకరించి, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం హారతి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మహేష్ (ఫైల్ ఫొటో)

ఎర్రావారిపాలెం, జూలై 16: విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బోడేవాండ్లపల్లె పంచాయతీ మేదరమిట్టలో చోటుచేసుకుంది. మేదరమిట్టకు చెందిన లక్ష్మీదేవి, వెంకటేష్ దంపతుల కుమారుడు మహేష్ (25) ఇంటి ముందు ఇనుప గేటును పట్టుకొని ఉండగా, విద్యుత్ వైర్ తెగి గేటుపై పడింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన మహేష్ కింద పడిపోయాడు. వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు యత్నిస్తుండగా, అప్పటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

ఉపాధి పనుల తనిఖీ ప్రారంభం

ఎర్రావారిపాలెం, జూలై 16: మండలంలో ఉపాధి హామీ పథకం కింద గతయేడాది జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రారంభమైంది. మండలంలోని 12 పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులను డీఆర్పీలు, ఎస్ఆర్పీలు వివిధ పంచాయతీల్లో క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో పనులు చేయకనే బిల్లులు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పనిచేసిన క్షేత్ర సహాయకులు (ఎఫ్ఎలు) రైతులు తమ పొలంలో ఏయే పనులు చేశారో రికార్డులు చేత పట్టుకొని పరిశీలన జరుపుతున్నారు. కానీ మండల ఏపీవో ఆశారాణి ఈజీఎస్ సోషల్ ఆడిట్ వివరాలు మీడియాకు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడుతున్నారు.

సంస్కృతభాషతో సమాజ మార్పులు


వీసీ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, జూలై 16: న్యాక్ ఆధ్వర్యంలో బెంగళూరులో రిఫార్మ్-2కె24 పేరిట మంగళవారం నిర్వహించిన సదస్సుకు జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి హాజరయ్యారు. దేశంలో శిక్షా వ్యవస్థల్లో చేపట్టాల్సిన సంస్కరణలు, సంస్కృతభాష ద్వారా భారతీయ సమాజంలో తీసుకురావాల్సిన ఆవిష్కరణలు వంటి అంశాలపై ఆయన ప్రస్తావించారు. సంస్కృతం ద్వారా భారతీయత, దేశాభివృద్ధి జరుగుతుందని వివరించారు.

మతసామరస్యానికి ప్రతీక పీర్ల పండగ


వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, జూలై 16: నవాబ్‌పేట, గాలివీధుల్లో మంగళవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. నవాబ్‌పేట నుంచి పెద్దపీర్ల చావడి వరకు పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం మసీదు పెద్దలు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. గాలివీధి వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు. ముస్లింలతో పాటు హిందువులు కూడా ఐక్యంగా ఏటా పీర్ల పండుగను జరుపుకోవడం మతసామరస్యానికి ప్రతీక అన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి, టీడీపీ మైనారిటీ నాయకులు మహబూబ్‌బాషా, మహేష్ యాదవ్, హేమంత్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చింతా భరణీయాదవ్, నసరుద్దీన్, అర్షద్, షాజహాన్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల్లో అవినీతిపై విచారణ


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకుడు మురళి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని మహిళా సంఘాల నుంచి వసూలైన పొదుపు మొత్తం, రుణాల్లో భారీ అవినీతి జరిగినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. మురళి మాట్లాడుతూ టీఎల్ఎఫ్‌లోనే రూ.50 లక్షల వరకు అవినీతి జరిగిందని ఆరోపణలున్నాయన్నారు. అందుకు సంబంధించిన పుస్తకాలను అధికారులు మాయం చేశారన్నారు. వైఎస్ఆర్ ఆసరా నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించారన్నారు. కలెక్టర్ తక్షణమే ఆడిట్ నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీరాములు, శివకుమార్, ఉదయ్‌కుమార్, ముని తదితరులు పాల్గొన్నారు.

అడవులను తలపిస్తున్న చెరువులు

- ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూడిపోయిన సప్లైచానల్స్


అన్నాస్వామి చెరువులో ముళ్లపొదలు

రామచంద్రాపురం, జూలై 16: మండలంలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో బోర్లు, బావులు, చెరువులు ప్రధాన వనరులుగా ఉన్నాయి. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకం ద్వారా చెరువుల అభివృద్ధికి చేయూతనిచ్చింది. ఆ తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వకపోగా ఉన్న పథకాలను రద్దు చేసింది. దీంతో మండలంలోని చెరువుల్లో ముళ్లపొదలు ఏర్పడి అడవులను తలపిస్తున్నాయి. మండలంలో 15 ఇరిగేషన్ చెరువులు ఉండగా, రాయలచెరువులో మాత్రమే కొద్దిపాటి నీరు నిల్వ ఉంది. రైతుల పొలాలకు సాగునీరు అందించే పరిస్థితి లేదు. చెరువు కింద ఉన్న సప్లై చానల్స్ పూర్తిగా ఆక్రమణకు గురి కావడంతో నీరు వచ్చినా పీవీపురం వద్ద ఉన్న కొండివానివంకలో కలిసి సముద్రం పాలవుతోంది. ఐదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం అమ్మగారి చెరువు, తాటిరెడ్డి చెరువు, అనిచెరువుల్లో పూడికతీత పనులకు రూ.19లక్షలు ఖర్చుచేశారు. సంగటిముద్దలకోన చెరువు, పుల్లుట్లవాగు చెరువు, కుప్పంబాదూరు చెరువు మొరవ కాలువల పటిష్ఠతకు రూ.32లక్షలు ఖర్చు చేశారు. కుప్పంబాదూరు చెరువు పనులను చెంగల్రాయనాయుడు రూ.6లక్షలతో చేశారు. ఈయన ఇరిగేషన్ కార్యాలయం చుట్టు ప్రదక్షిణ చేసినా నిధులు విడుదల కాలేదు. రెండేళ్ల క్రితం చనిపోయాడు. ఆ కుటుంబం కూడా అప్పుల పాలైంది. గత నెలరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నా సప్లైచానల్స్ చాలా వరకు పూడిపోవడం, ఆక్రమణలకు గురికావడంతో చెరువుల్లోకి నీరువచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి చెరువుల్లో పూడికతీత, కట్టల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టండి



రెండేళ్లుగా సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులు ఎండిపోయాయి. బావులు, బోర్లలో కూడా నీరు తగ్గిపోవడంతో పొలాలకు సాగునీరు అందడంలేదు. ప్రభుత్వం స్పందించి చెరువుల్లో పూడిక తీసి రైతులను ఆదుకోవాలి.

- చేకూరు హరి నాయుడు, రైతు, మిట్టూరు

చంద్రగిరిలో ఆర్టీసీ డిపోకు స్థల పరిశీలన

గోవిందధామం పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఎమ్మెల్యే నాని


ఆర్టీసీ డిపోకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జూలై 16: చంద్రగిరిలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటుకు ఎమ్మెల్యే పులివర్తి నాని స్థల పరిశీలన చేశారు. మంగళవారం చంద్రగిరికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సు డిపో కోసం 5 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రగిరిలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేయడం వలన తమిళనాడు, కర్నాటక, మదనపల్లె నుంచి వచ్చే బస్సులు చంద్రగిరిలోనే ఉండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీని వలన తిరుపతిలో కూడా ట్రాఫిక్ తగ్గుతుందని పేర్కొన్నారు. చంద్రగిరి పంచాయతీలో గోవిందధామం ఏర్పాటు చేయడానికి రెండు ఎకరాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పనులు ప్రారంభించాలని సూచించారు. విజయనగర కాలనీలో మురుగు కాలువ సమస్యను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి, రాయలపురం, నూకలగుంట మీదుగా తొండవాడ డ్రైనేజీ కాలువలోకి కలిపే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణం చేపట్టేప్పుడు మురుగు కాలువలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఎక్కడైనా దీర్ఘకాలిక సమస్యలు ఉంటే మండల టీడీపీ నాయకుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో పేరుకే చలువ పందిళ్లు

- వర్షం వస్తే భక్తులు తడవాల్సిందే
- గతంలో మాదిరిగా రేకులతో పైకప్పు ఏర్పాటు చేయాలని భక్తుల డిమాండ్


శ్రీనివాసమంగాపురంలోని చలువ పందిరి దుస్థితి

చంద్రగిరి, జూలై 16: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పేరుకే చలువ పందిళ్లు. వర్షం కురిస్తే భక్తులు తడవాల్సిందే. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గతంలో ఆర్కియాలజీ అనుమతితో ఇనుప రేకులపై తాత్కాలికంగా పైకప్పులు (చలువ పందిళ్లు) వేసేవారు. అయితే కడప జిల్లా ఒంటిమిట్టలోని కోదండరామాలయంలో రెండేళ్ల క్రితం బీభత్సమైన గాలివాన రావడంతో ఆలయ ఆవరణలో పైన వేసిన ఇనుప రేకులు విరిగి భక్తులపై పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. దీంతో అప్పటి నుంచి టీటీడీ ఆలయాల్లో రేకులతో కాకుండా వల మాదిరిగా ఉన్న క్లాత్‌తో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన వర్షం కురిస్తే భక్తులు కొద్ది సేపు కూడా ఆలయ ఆవరణలో కూర్చోలేకపోతున్నారు. వేసవి కాలంలోనూ ఎండకు భక్తులు అరుగుపైన కూడా కూర్చోలేకపోతున్నారు. కోతులు గుడ్డతో తయారు చేసిన చలువ పందిళ్లను చించివేస్తున్నాయి. ఎక్కడో ఏదో జరిగిందని అన్ని ఆలయాల్లో చలువ పందిళ్లను గుడ్డతో వేయడం విడ్డూరంగా ఉందని భక్తులు విమర్శిస్తున్నారు. టీటీడీ అధికారులు స్పందించి ఇకనైనా ఆలయ ఆవరణలో ఇనుప రేకులతో కూడిన చలువ పందిళ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుపుకుందాం

- ఎమ్మెల్యే పులివర్తి నాని



పాకాల, జూలై 16: మండలంలోని ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన వల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యస్వామి వారి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను అందరి సహకారంతో ఘనంగా జరుపుకుందామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఉభయదారులు, ప్రజాప్రతినిధులతో ఆడికృత్తిక ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, అన్నప్రసాదాల పంపిణీ, శాంతి భద్రతలు, పార్కింగ్, వైద్య శిబిరాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. జడ్పీటీసీ నంగా పద్మజ రెడ్డి, జిల్లా దేవదాయశాఖ కమిషనర్ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ వాణిశ్రీ, సీఐ శ్రీరాముడు, ఈవో యువరాణి, విద్యుత్ శాఖ ఈఈ వాసుదేవరెడ్డి, టీడీపీ సీనియర్ నేత వలపల దశరథ నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, మాజీ కమిటీ చైర్మన్లు ఆముదపాకల శ్రీహరి నాయుడు, ఆర్.ఆనందచౌదరి, నాయకులు చంద్రశేఖర్ నాయుడు, బుజ్జి, వి.రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు


రామయ్య

పుత్తూరు అర్బన్, జూలై 16: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన సోమవారం జరిగింది. డీఎస్పీ శ్రీనివాసరావు కథనం మేరకు... పుత్తూరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రామయ్య 2020 ఏప్రిల్ 20వ తేదీన ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ వెంకట్రామిరెడ్డి కేసు నమోదు చేశారు. చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎన్.శాంతి సోమవారం నిందితుడు రామయ్యకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసును స్పెషల్ పీపీ శైలజ బాధితుల తరఫున వాదించారు. కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడడానికి కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ పట్టాభి, సబ్ డివిజన్ కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణమరాజును డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

ఎయిర్‌పోర్టు వద్ద వెంచర్ స్థల వివాదం

పనులను ఆపాలన్న రెవెన్యూ సిబ్బందిపై దాడి



ఏర్పేడు, జూలై 16: వెంచర్ స్థలం విషయమై వివాదం ఉండడంతో పనులు ఆపాలన్న రెవెన్యూ సిబ్బందిపై నిర్వాహకులు దాడికి పాల్పడిన ఘటన ఏర్పేడు మండల పరిధిలో మంగళవారం జరిగింది. రెవెన్యూ సిబ్బంది కథనం మేరకు వివరాలు... తిరుపతి విమానాశ్రయ సమీపంలోని గోవిందవరం పంచాయతీ జింకలమిట్ట కాలనీ వద్ద సర్వే నంబరు 6, 466లలోని సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఓ పోలీసు అధికారి బంధువులు వెంచర్ వేశారు. ఇందులో కొంత ప్రభుత్వ భూమి ఉండడంతో రెవెన్యూ అధికారులు కోర్టులో కేసు వేశారు. ఇదిలా ఉండగా వెంచర్ నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో రెవెన్యూ సిబ్బంది ఏర్పేడు తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు వివాదాస్పద స్థలంలో పనులు చేయొద్దని నిర్వాహకులకు చెప్పినా ఖాతరు చేయకపోవడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం రెవెన్యూ సిబ్బంది వెంచర్ వద్దకు వెళ్లి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో వెంచర్ నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తహసీల్దారు డ్రైవర్ నాగరాజు కిందపడడంతో ఆయన కాలుకు గాయమైంది. దీనిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దారు చెప్పారు.

భక్తులతో గౌరవంగా వ్యవహరించండి

- తిరుమలలో ఆకస్మిక తనిఖీల్లో విజిలెన్స్, పోలీసులకు ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశం



తిరుమల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం ప్రపంచం నలుమూల నుంచి వచ్చే భక్తులతో గౌరవంగా వ్యవహరించాలని నూతన ఎస్పీ సుబ్బరాయుడు తిరుమల పోలీసు అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాయుడు మంగళవారం సాయంత్రం తిరుమలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తిరుమలలోని వన్‌టౌన్, టూటౌన్, క్రైం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్‌లలో తనిఖీ చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరుపై సమీక్షించి, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మరింత కట్టుదిట్టంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నెలకోసారి టీటీడీ విజిలెన్స్ అధికారులతో సమీక్ష నిర్వహించాలన్నారు. లంచాలు తీసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. తిరుమలలో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పిక్‌పాకెట్ నేరగాళ్లు, సెల్‌ఫోన్ దొంగలు, తల్లిదండ్రులను ఏమార్చి పిల్లలను అపహరించే వారిపై గట్టి నిఘా ఉంచాలన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ నేతలు

తిరుపతి(విద్య), జూలై 16: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్)మువ్వా రామలింగాన్ని ఆపస్ నాయకులు కోరారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, కృష్ణా జిల్లా బాధ్యులు రఘునాథ్, సతీష్‌కుమార్ విజయవాడలోని విద్యాభవన్‌లో మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుకు ఉత్తర్వులు వెలువరించాలని కోరారు. 117 జీవోను రద్దు చేయాలన్నారు.

పరిశ్రమల స్థాపనకు కృషి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16: ఎంఎస్ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశ్రమల శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏపీఐఐసీ అధికారులతో సమీక్షించారు. పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు పెద్దపీట వేస్తోందన్నారు. సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు కావాల్సిన అనుమతులను సకాలంలో అందజేస్తూ తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీఐఐసీ జడ్ఎం చంద్రశేఖర్, డిప్యూటీ జడ్ఎంలు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన టీడీపీ నేతలు



తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడులను టీడీపీ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు మునస్వామి యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, మనోహరాచారి, యశ్వంత్ రెడ్డి, రాజయ్య, హేమంత్ యాదవ్, కట్టా జయరాం యాదవ్, చింతా భరణి యాదవ్, గంధం బాబు, దొరస్వామి నాయుడు, వెంకటకృష్ణయ్య, హరి, వివేక్, చెంగయ్య, సురేష్ తదితరులు ఉన్నారు.

నాన్ టీచింగ్ అసోసియేషన్ నేత ప్రదీప్‌కు సన్మానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16: ఎస్వీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో కార్యవర్గ సభ్యుడిగా గెలుపొందిన కె. ప్రదీప్ కుమార్‌ను పలువురు సన్మానించారు. యూనివర్సిటీ లైబ్రరీలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్య, లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం, శేఖర్, శ్రీధర్‌రెడ్డి, సలీం, గిరిబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు.

రైతు రుణాలను రద్దు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), జూలై 16: రైతు రుణాలను వడ్డీతో సహా రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత ఎంపీ గురుమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఢిల్లీలో రైతుల ఆందోళన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని కోరారు. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. పంటల బీమా పథకాన్ని రైతులకు ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నిలకడగా గురుకుల విద్యార్థుల ఆరోగ్యం


పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్

నాయుడుపేట టౌన్, జూలై 16: కలుషిత ఆహారంతో ఆస్పత్రి పాలైన నాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉంది. 128 మంది విద్యార్థులు ఆదివారం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందగా సోమవారానికి సగానికి పైగా డిశ్చార్జి అయ్యారు. నాయుడుపేట ఆస్పత్రిలో 20 మంది, నెల్లూరులో 13మంది, గూడూరులో 30మంది చికిత్స పొందుతున్నారు.

జేసీ విచారణ ప్రారంభం

గురుకుల పాఠశాలలో కలుసిత ఆహారం ఘటనపై జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ మంగళవారం విచారణ చేపట్టారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడి అధికారుల నుంచి వివరాలను సేకరించారు.అక్కడినుంచి నేరుగా గురుకుల పాఠశాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. గురుకుల విద్యాలయ అధికారులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. దీనిపై సమగ్ర నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందిస్తామని ఆయన తెలిపారు. అపరిశుభ్ర వాతావరణంతో పాటు సరైన భోజన వసతులు లేని ఇటువంటి హాస్టల్‌లో తమ పిల్లలను ఎలా చదివించాలని పలువురు తల్లిదండ్రులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు కూడా జేసీని కలిసి ఇక్కడి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీసీవో పద్మజ, ఆర్డీవోలు కిరణ్‌కుమార్,చంద్రముని,తహసీల్దారు కల్యాణి, మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వందమందికి పైగా విద్యార్థులు ఒక్కసారిగా ఆస్పత్రి పాలవడంతో గురుకుల విద్యాలయ అధికారుల్లో చలనం వచ్చింది.డివిజన్‌స్థాయి అధికారులంతా గురుకుల విద్యాలయానికి చేరుకుని పరిస్థితులను చక్కదిద్దే పనిలో పడ్డారు.మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆదివారం, సోమవారం పరిసరాలను శుభ్రపరిచారు.

ఆలయాల్లో ఘనంగా ఆణివార ఆస్థానం

తిరుపతి (కల్చరల్) జూలై 16: గోవిందరాజస్వామి, కోదండ రామస్వామి ఆలయాల్లో మంగళవారం ఆణివార ఆస్థానం ఘనంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారిని వేంచేపు చేసి, సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలను తీసుకువచ్చి స్వామికి సమర్పించారు. కోదండరామస్వామి ఆలయంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామిని గరుడాళ్వార్ సన్నిధికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. తిరుమల పెద్ద జీయరు, చిన్న జీయరుస్వామి, ఆలయ అర్చకులు, డిప్యూడి ఈవో నాగరత్న, సోమశేఖర్, సురేష్, చలపతి తదితర అధికారులు, భక్తులు పాల్గొన్నారు. గోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజులు జ్యేష్ఠాభిషేకం జరుగుతోంది. ఉత్సవ మూర్తులకు శత కలశస్నపనం, మహా శాంతి హోమం, స్నపన తిరుమంజనం నిర్వహించారు.


కోదండరామస్వామి ఆలయంలో ఆణివార ఆస్థానం

నేడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాక

తిరుపతి (కలెక్టరేట్), జూలై 16: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ జాతీయ రహదారుల ప్రాజెక్టులపై అధికారులతో చర్చించనున్నారు. తర్వాత హెలికాప్టర్‌లో మదనపల్లి బయలుదేరుతారు. అక్కడ కార్యక్రమాల్లో పాల్గొన్నాక రాత్రి తిరుమల చేరుకుంటారు. గురువారం వేకువజామున శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం ఢిల్లీ బయలుదేరుతారని కలెక్టర్ వివరించారు.

త్వరితగతిన విమానాశ్రయ పనుల పూర్తి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16: రేణిగుంట విమానాశ్రయంలో హార్టికల్చర్, లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. హార్టికల్చర్, మొక్కల మెయింటెన్స్, బ్యూటిఫికేషన్ చర్యలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తుడా అధికారులకు సూచించారు. సమీప కూడళ్ల వద్ద రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తుడా ఇన్‌ఛార్జి వీసీ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ డీఈ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచలకిషోర్, సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య),జూలై16: జవహర్ నవోదయ విద్యాలయాల్లో వచ్చే విద్యాసంవత్సరానికి 6,9 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని విశ్వం పోటీపరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. సెప్టెంబరు 16తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందన్నారు. వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లో గానీ లేదా 8688888802/ 9399976999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

టీటీడీ సీవీఎస్‌వోకు వీడ్కోలు

తిరుచానూరు, జూలై 16: టీటీడీ సీవీఎస్‌వో నరసింహ కిషోర్ మంగళవారం తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. బదిలీ అయి వెళుతున్న నేపథ్యంలో ఆయనను ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్, వీజీవో బాలిరెడ్డి, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, ఏఈవో రమేష్, ఏఎస్ఐ బ్రహ్మానందరాజు, అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు.



ఎమ్మెల్యే నానికి ఆర్టీసీ అధికారుల సత్కారం



తిరుపతి(ఆర్టీసీ), జూలై 16: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి మంగళవారం కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో మెరుగైన బస్ సర్వీసులు కల్పించేందుకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రేణిగుంట-చంద్రగిరి, తిరుపతి-పాకాల రూట్లలో రెండేసి చొప్పున పల్లెవెలుగు బస్సులు నడపాలని సూచించారు. టైమింగ్స్, రూట్‌మ్యాప్ సిద్ధం చేశాక ప్రారంభానికి ఆహ్వానిస్తామని అధికారులు ఆయనకు తెలియజేశారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)లక్ష్మీనారాయణ, సీబీఎస్ సూపర్‌వైజర్ తండాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరం కథలు పుస్తకావిష్కరణ

తిరుపతి (కల్చరల్) జూలై 16: తిరుపతికి చెందిన రచయిత డాక్టర్ నగరం వినోద్ కుమార్ కలం నుంచి జాలువారిన నగరం కథలు పుస్తకం ఆవిష్కరణ సభ బుధవారం జరుగుతుందని ఈతరం కవితా వేదిక ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక యూత్ హాస్టల్లో ఉదయం 10 గంటలకు జరిగే సభలో పలువురు రచయితలు పాల్గొంటారన్నారు.

ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి


మంత్రి లోకేష్‌తో హేమంత్‌రాయల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16: మెగా డీఎస్సీ విడుదల చేయనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో నిరుద్యోగ అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ కోరారు. విజయవాడలో మంత్రి ని ఆయన మంగళవారం కలిశారు. ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్ల భర్తీలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

రేపట్నుంచి కుష్టువ్యాధిపై ఇంటింట సర్వే

తిరుపతి(వైద్యం), జూలై 16 : కుష్టు రహిత సమాజాన్ని సాధించేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ఇంటింట కుష్టువ్యాధి సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో లెప్రసీ నోడల్ అధికారులకు స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధిని ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం బారిన పడకుండా రక్షించవచ్చన్నారు. వ్యాధి గుర్తింపు, నివారణ, చికిత్సల గురించి వివరించారు. అధికారులు రమణ, తిరుజ్ఞానం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి మొక్కు చెల్లించిన టీడీపీనేతలు

తిరుపతి రూరల్,జూలై16: కూటమి ప్రభుత్వం ఘన విజయాన్ని సాధించడంపై దుర్గసముద్రం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు మంగళవారం తిరుమలలో శ్రీవారికి మొక్కు చెల్లించారు. టీటీడా జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్ నేతృత్వంలో 50 మంది కార్యకర్తలు శ్రీవారి మెట్టుమార్గంలో తిరుమల చేరుకుని మొక్కు చెల్లించినట్లు పేర్కొన్నారు. చంద్రశేఖర్, నాగరాజు, శంకర్, నాగయ్య పాల్గొన్నారు.

పాలిసెట్ చివరి దశ సీట్ల కేటాయింపు

తిరుపతి(విద్య), జూలై16: ఏపీ పాలిసెట్‌లో చివరి దశ సీట్లను రాష్ట్రప్రభుత్వం మంగళవారం కేటాయించింది. తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆఫీసర్స్ క్లబ్ కమిటీ ఉపాధ్యక్షుడిగా రవి


రవి, నరశింహులు

తిరుపతిరూరల్,జూలై16: ఆఫీసర్స్ క్లబ్ కమిటీ ఉపాధ్యక్షులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలఅధ్యాపకులసంఘ రాష్ట్ర అధ్యక్షుడు వీ రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి జి.రామచంద్రయ్య పేర్కొన్నారు. మిగతా పోస్టులకు 21న ఎన్నికలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు.

20, 21తేదీల్లో తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 16: బుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈనెల 20, 21తేదీల్లో తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 4గంటలకు సీబీఎస్, వివిధ డిపోల నుంచి బస్ సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల వరకు నడుస్తాయన్నారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. నేరుగా వచ్చినా నాన్‌ఏసీ, ఏసీ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. రిజర్వేషన్ టిక్కెట్‌పై 10శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు.

డ్రగ్స్ నివారణకు విద్యార్థుల సహకారం


హోం మంత్రి అనితతో ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16: డ్రగ్స్ నివారణకు విద్యార్థుల సహకారం తీసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి అనితను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ కోరారు. సచివాలయంలోని హోం మంత్రిని కలిసి ఆయన ఈ మేరకు విన్నవించారు. డ్రగ్స్ నివారణ కమిటీల్లో విద్యార్థులకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యా కేంద్రాల దగ్గర మాదక ద్రవ్యాల సరఫరా సాగిందనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ నిలుపుదలపై హర్షం

తిరుపతి(వైద్యం), జూలై 16 : సీపీఎస్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న గెజిట్ నోటిఫికేషన్‌ను నిలుపుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడంపై ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గెజిట్ నోటిఫికేషన్ జారీపై ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో రద్దు నిర్ణయం ఆనందాన్ని నింపిందన్నారు. తాము తలపెట్టిన నిరసన కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి డబ్బులు ఇప్పించండి

తిరుపతి (ఆటోనగర్) జూలై 16: నగర సమీపాన వెంచర్లు వేసి ప్లాట్లు ఇస్తామని మల్లం మణికంఠారెడ్డి అనే వ్యక్తి తమ నుంచి వసూలు చేసిన డబ్బులు వెంటనే తిరిగి ఇప్పించాలని బాధితులు సాయికృష్ణ,శ్రీధర్ కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. మూడేళ్ల క్రితం మణికంఠారెడ్డి సుమారు పది మంది నుంచి రూ.1.70 కోట్ల మేర ప్లాట్ల పేరుతో తీసుకున్నారన్నారు. ఏళ్ళు గడుస్తున్నా ప్లాట్లు చూపలేదన్నారు. కలెక్టర్, ఎస్పీ స్పందించి డబ్బులు తిరిగి ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మార్కెట్ టెండర్లలో అధికారి ఏకపక్షతీరు

● విజనరీ గ్రూప్ నిర్వాహకుల ధ్వజం


మాట్లాడుతున్న బుజ్జిబాబు నాయుడు

తిరుపతి(ఆటోనగర్), జూలై16: నగర పాలక సంస్థ పరిధిలోని మార్కెట్ల వేలం పాట టెండర్ల దరఖాస్తుల విషయంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని విజనరీ గ్రూప్ నిర్వాహకులు ఎస్.బుజ్జిబాబు నాయుడు, కె.సుబ్బరాయులు నాయుడు ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మాట్లాడారు. ఇందిరా ప్రియదర్శిని, పట్నాలు వీధి మార్కెట్లు,పార్కింగ్ స్థలాలకు బహిరంగ టెండర్లకు రెవెన్యూ అధికారి కెఎల్ వర్మ సోమవారం షెడ్యూల్ ఫారాలు అందజేతలో పక్షపాతం వహించారన్నారు. అనుకూలురుకే షెడ్యూల్ ఫారాలు ఇచ్చారన్నారు. గతంలో ఈ అధికారి పుంగనూరులో కూడా నాటి వైసీపీ ప్రభుత్వంతో సన్నిహితంగా వ్యవహరించారన్నారు. నాయకులు ఎల్.సుబ్బరాయులునాయుడు, లోకేష్, నిరంజన్ నాయుడు, మధుయాదవ్‌లు పాల్గొన్నారు.

సీల్డ్ టెండర్ వేయకపోయినా నేరుగా పాల్గొనవచ్చు

తిరుపతి, జూలై16: నగరపాలక సంస్థ మార్కెట్లకు, పార్కింగ్ స్థలాలకు గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. సీల్డ్ టెండర్ల ద్వారా పాల్గొనని వారు కూడా నేరుగా బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని మేయరు డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునన్నారు. వచ్చే ఏడాది 31 వరకు రుసుం వసూలుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విమర్శల దుమారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

జనసేన సభ్యత్వ నమోదులో నెంబర్ వన్ కావాలి

● ఎమ్మెల్యే ఆరణి క్యాడర్‌కు పిలుపు


మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, జూలై 16: జనసేన సభ్యత్వ నమోదులో తిరుపతి నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా నిలపాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. నిజమైన కార్యకర్తలకు నమోదులో ప్రాధాన్యమివ్వాలన్నారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు నేపథ్యంలో మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. డివిజన్‌కు ఒక నాయకుడు, నాయకురాలిని , 5 డివిజన్లకు ఒకరిని ఇన్‌చార్జ్‌గా నియమించాలన్నారు. నియోజకవర ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో 500కి తగ్గకుండా చేస్తే తప్పకుండా పాతికవేలు మందిని సభ్యులుగా చేర్పవచ్చన్నారు. పార్టీ నగరాధ్యక్షుడు రాజారెడ్డి, పొలకల మల్లికార్జున్, వెంకటేశ్వరరావు, హరిశంకర్, పి.వినోద్‌రాయల్ పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి చర్యలు తీసుకోండి : బీజేపీ


ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 16: తిరుపతిలో గంజాయి విక్రయాన్ని అరికట్టాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్ రెడ్డి, చామంచి శ్రీనివాస్‌లు వినతి పత్రం సమర్పించారు. గంజాయి వల్ల విద్యార్థులు, యువకులు భవిష్యత్తును నాశనం చేసుకున్నారన్నారు. చాలా మంది బానిసలైపోయారన్నారు. గంజాయి మత్తులో దాడులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి రవాణా, లభ్యతపై ఉక్కుపాదం మోపాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు అజయ్‌కుమార్, పొనగంటి భాస్కర్‌లు ఉన్నారు.

నేడు జాతీయ విద్యా విధానంపై సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16: నూతన జాతీయ విద్యా విధానంపై పద్మావతి యూనివర్సిటీలో బుధవారం సదస్సు నిర్వహించనున్నారు. ఉమెన్ స్టడీస్ - ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సంయుక్తంగా దీనిని నిర్వహించనున్నాయి. ఉదయం 10 గంటలకు సావేరి హాల్లో ప్రారంభమయ్యే సదస్సులో పలువురు విద్యారంగ ప్రముఖులు పాల్గొంటారని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని తెలిపారు.

19న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 16: ఈ నెల 19న ఎస్వీ యూనివర్సిటీలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. శ్రీజ, టాటా విస్ట్రమ్, ఆయుష్ ఇన్‌ఫ్రా, విహారి మార్కెటింగ్ తదితర కంపెనీలు హాజరు కానున్నాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ చదువుకున్న వారు అర్హులు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ప్రారంభం కానుంది. మరింత సమాచారం కోసం.. 9533889902 నంబరులో సంప్రదించవచ్చునని వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.



నిలకడగా గురుకుల విద్యార్థుల ఆరోగ్యం

నాయుడుపేట టౌన్, జూలై 16: కలుషిత ఆహారంతో ఆస్పత్రి పాలైన నాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉంది. 128 మంది విద్యార్థులు ఆదివారం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందగా సోమవారానికి సగానికి పైగా డిశ్చార్జి అయ్యారు. నాయుడుపేట ఆస్పత్రిలో 20 మంది, నెల్లూరులో 13మంది, గూడూరులో 30మంది చికిత్స పొందుతున్నారు.

జేసీ విచారణ ప్రారంభం

గురుకుల పాఠశాలలో కలుసిత ఆహారం ఘటనపై జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ మంగళవారం విచారణ చేపట్టారు. నాయుడుపేట తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడి అధికారుల నుంచి వివరాలను సేకరించారు.అక్కడినుంచి నేరుగా గురుకుల పాఠశాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. గురుకుల విద్యాలయ అధికారులు, సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. దీనిపై సమగ్ర నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందిస్తామని ఆయన తెలిపారు. అపరిశుభ్ర వాతావరణంతో పాటు సరైన భోజన వసతులు లేని ఇటువంటి హాస్టల్‌లో తమ పిల్లలను ఎలా చదివించాలని పలువురు తల్లిదండ్రులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు కూడా జేసీని కలిసి ఇక్కడి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీసీవో పద్మజ, ఆర్డీవోలు కిరణ్‌కుమార్,చంద్రముని,తహసీల్దారు కల్యాణి, మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వందమందికి పైగా విద్యార్థులు ఒక్కసారిగా ఆస్పత్రి పాలవడంతో గురుకుల విద్యాలయ అధికారుల్లో చలనం వచ్చింది.డివిజన్‌స్థాయి అధికారులంతా గురుకుల విద్యాలయానికి చేరుకుని పరిస్థితులను చక్కదిద్దే పనిలో పడ్డారు.మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆదివారం, సోమవారం పరిసరాలను శుభ్రపరిచారు.



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నజేసీ ధ్యానచంద్

త్వరితగతిన విమానాశ్రయ పనుల పూర్తి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 16: రేణిగుంట విమానాశ్రయంలో హార్టికల్చర్, లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. హార్టికల్చర్, మొక్కల మెయింటెన్స్, బ్యూటిఫికేషన్ చర్యలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తుడా అధికారులకు సూచించారు. సమీప కూడళ్ల వద్ద రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. తుడా ఇన్‌చార్జి వీసీ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ డీఈ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో పెంచలకిషోర్, సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

18నుంచి కుష్ఠువ్యాధి బాధితుల సర్వే

సత్యవేడు, జూలై 16: జాతీయ కుష్ఠువ్యాధి నివారణలో భాగంగా మండలంలో ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్ఠువ్యాధి బాధితులను గుర్తించేందుకు ప్రత్యేక ఎల్‌సీడీపీ క్యాంపులు నిర్వహించనున్నట్లు దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుణశేఖర్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో ఎల్‌సీడీపీ క్యాంపుకు సంబంధించి ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపట్టే సర్వేలో వైద్య సిబ్బంది గ్రామాల్లో కుష్ఠువ్యాధి బాధితులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భానుమతి, స్టాఫ్ నర్సులు పార్వతి, వనజాక్షి, ఫార్మాసిస్ట్ భార్గవి, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో మూడేళ్ల జైలు

పుత్తూరు అర్బన్, జూలై 16: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన సోమవారం జరిగింది. డీఎస్పీ శ్రీనివాసరావు కథనం మేరకు... పుత్తూరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రామయ్య 2020 ఏప్రిల్ 20వ తేదీన ఓ బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ వెంకట్రామిరెడ్డి కేసు నమోదు చేశారు. చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి ఎస్.శాంతి సోమవారం నిందితుడు రామయ్యకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసును స్పెషల్ పీపీ శైలజ బాధితుల తరఫున వాదించారు. కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడడానికి కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ పట్టాభి, సబ్ డివిజన్ కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణమరాజును డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.



రామయ్య

టీడీపీ సీనియర్ నేత మృతి

కేవీబీపురం, జూలై 16: కేవీబీపురం మండలంలోని కాట్రపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత రామ్మూర్తిశెట్టి(83) మంగళవారం మధ్యాహ్నం తన స్వగృహంలో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీ కోసం ఎన్నో సేవలు అందించారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి సన్నిహితుడైన రామ్మూర్తిశెట్టి మరణవార్త తెలుసుకున్న పలువురు నాయకులు ఆయనకు నివాళులర్పించారు.



రామ్మూర్తి శెట్టి (ఫైల్‌ఫొటో)

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూలై 16: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.



బాలవికాస కేంద్రాల అధ్యాపకులకు శిక్షణ తరగతులు

శ్రీకాళహస్తి, జూలై 16: పట్టణంలోని భరద్వాజతీర్థం గంగాసదన్‌లో సమరసత సేవా ఫౌండేషన్ బాలల వికాస కేంద్రాల అధ్యాపకులకు రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సతీమణి రిషితారెడ్డి మాట్లాడుతూ సనాత హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ఎస్ఎస్ఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వారికి తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఎస్ఎస్ఎఫ్ ప్రాంత ప్రముఖ్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్యం నుంచే ప్రతి ఒక్కరిలో హిందూ ధర్మం, భారతదేశం పట్ల భక్తిభావన కలగాలనే ఉద్దేశంతో 2019లో బాలవికాస కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. టీటీడీ సౌజన్యంతో రాష్ట్రం మొత్తం ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో ఆలయాలను నిర్మించి ధర్మప్రచారం చేస్తామన్నారు. రాష్ట్రంలోని 327 బాలవికాస కేంద్రాల ఆచార్యులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం అచార్యులు, మాతాజీలకు శిక్షణ సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రాంత ధర్మజాగరణ ప్రముఖ్ కొండారెడ్డి, నాగరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న రిషితారెడ్డి

కన్నుల పండువగా కల్యాణ వెంకన్న ఆణివార ఆస్థానం

నారాయణవనం, జూలై 16: మండలంలో నెలకొన్న పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఆణివార ఆస్థానం కన్నుల పండువగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు శుద్ధి, తోమాల, అర్చన, గంట, నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం నిత్యకైంకర్యాల అనంతరం ఊంజల మండలంలో శేష వాహనంపై ఉభయదేవరుల సమేత కల్యాణ వెంకన్నను కొలువుదీర్చారు. టీటీడీ తరుపున ఆలయాధికారులు పట్టు వస్త్రాలను సమర్పించారు. అర్చకులు ఆస్థానం నిర్వహించి భక్తులు అక్షింతలను, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. స్థానిక ఆలయాల ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు పర్యవేక్షించారు.



భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

వరదయ్యపాళెం, జూలై 16: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీరాములు కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, సంక్షేమ పథకాల అమలు, జీవో 17 ద్వారా గత ప్రభుత్వం నిధులు మళ్లింపు గురించి వివరించారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న 46వేల క్లైయిమ్స్ నిధులను మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రబాబు, పురుషోత్తం, కోటిబాబు, చిరంజీవి, సుబ్రహ్మణ్యం, ఈశు తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయండి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 16: నగరి నియోజకవర్గ సమస్యలపై సీఎం చంద్రబాబు నాయుడికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం అమరావతిలో సీఎంను కలిసిన ఎమ్మెల్యే నగరి పట్టణంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే కోసలనగరం పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు భానుప్రకాష్ వివరించారు.

హెల్మెట్‌తో ప్రాణరక్షణ



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ అనిత

శ్రీకాళహస్తి, జూలై 16: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణరక్షణ లభిస్తుందని వన్‌టౌన్ ఎస్ఐ అనిత తెలిపారు. పట్టణంలోని రామసేతు కూడలి వద్ద మంగళవారం ఆమె వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న యువకులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగిఉండాలన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

పుత్తూరు అర్బన్, జూలై 16: పట్టణంలోని గేటు పుత్తూరులో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలను ఆ శాఖ సాధికారక అధికారి సూర్యనారాయణ మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని పారిశుధ్య నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

టీటీడీలో అక్రమాలపై విచారణ నిర్వహించాలి

గూడూరు అర్బన్, జూలై 16: తిరుమల తిరుపతి దేవస్థానంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని ఢిల్లీలో సీబీఐ అధికారులకు విన్నవించినట్లు కలియుగ వెంకటేశ్వరస్వామి ధార్మిక మండలి అధ్యక్షుడు పెంచలనాయుడు మంగళవారం పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో టీటీడీలో పలు అవకతవకలు జరిగాయని భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అప్పటి అధికారులు, బోర్డు సభ్యులు వ్యవహరించారని వీటిపై సీబీఐ విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుని టీటీడీ పవిత్రను కాపాడాలని కోరామని తెలిపారు.

నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

గూడూరు, జూలై 16: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆర్డీవో కిరణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆసుపత్రిలో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. తహసీల్దారు కరుణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు ద్వారా విరివిగా రుణాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 16: సహకార బ్యాంకు ద్వారా రైతులు, మహిళలు, వ్యాపారస్తులు, ఉద్యోగులు విరివిగా రుణాలు అందిస్తున్నట్లు బ్యాంకు ప్రతినిధి రమేష్ తెలిపారు. బీఎన్‌కండ్రిగ కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ నేరాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి డీసీసీబీ మేనేజర్ శేఖర్ మాట్లాడుతూ కేంద్ర సహకార బ్యాంకులో రైతులకు ట్రాక్టర్లు, పంట రుణాలు, కోళ్ల ఫారమ్‌లు, మహిళలకు ఎస్‌హెచ్‌జీ రుణాలు అందించడం జరుగుతుందన్నారు.

జాబ్‌మేళాలో 22 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కళాశాల యాజమాన్యం

పుత్తూరు టౌన్, జూలై 16: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గోవిందపాలెంలో ఉన్న శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 140 మంది విద్యార్థులు పాల్గొనగా ఇంటర్వ్యూలు నిర్వహించి 22 మందిని ఎంపిక చేసినట్లు మ్యాజిక్ బస్ ఫౌండేషన్ జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ పి.వెంకటప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ మాణిక్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచామృత గిన్నెల బహూకరణ



పంచామృత గిన్నెలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి, జూలై 16: శ్రీకాళహస్తీశ్వరాలయానికి నాయుడుపేటకు చెందిన సురేష్, రమేష్ పది పంచామృత గిన్నెలను మంగళవారం బహూకరించారు. వాటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు మల్లికార్జున ప్రసాద్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో శ్రీకాళహస్తివాసుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూలై 16: బెంగళూరులో కర్ణాటక స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించిన ఇంటర్‌స్టేట్ యోగా పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెంది సుజాత ప్రతిభ కనబరచి మొదటి స్థానంలో నిలిచారు. ఆమె పట్టణంలో నడుపుతున్న శివసాయి యోగాసెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న సోహిత, నవనీత్ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు.

పట్టపగలు కాకినాడవాసిపై హత్యాయత్నం

- ఇనుపరాడ్‌తో దాడి చేసిన గుర్తుతెలియని వ్యక్తి

తడ, జూలై 16: పట్టపగలు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇనుపరాడ్‌తో మరో వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన సతీష్‌కుమార్ స్థానిక శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంటాడు. రోజులాగానే మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో పరిశ్రమకు వెళుతున్నాడు. మార్గం మధ్యంలో ఓబాలమ్మ ఆలయం వద్ద గుర్తుతెలియన వ్యక్తి ఒక ఇనుపరాడ్‌తో వెనుక నుంచి దాడిచేశాడు. అందరూ చూస్తుండగానే తీవ్రంగా గాయపరచి అక్కడ నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సతీష్‌కుమార్‌ను శ్రీసిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం చెన్నైకు తీసుకెళ్లారు. సతీష్‌కుమార్‌కు కాకినాడ పట్టణానికి చెందిన నీలాపు మౌనిక అనే వివాహితతో పరిచయం ఏర్పడింది. దీంతో ఆమె తన భర్త, ఇద్దరు పిల్లలను వదిలివేసి నాలుగు నెలల క్రితం సతీష్‌కుమార్‌తో కలిసి తడకు వచ్చేసింది. ఇక్కడ ఓ అద్దె ఇంట్లో ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. కొద్దిరోజులుగా తన భర్త తమ ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు, పలుమార్లు మాట్లాడి బెదిరించినట్టు ఇందులో భాగంగా అతనే ఈ హత్యాయత్నానికి పాల్పడి ఉంటాడని మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడ్డ సతీష్‌కుమార్

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, జూలై 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవస్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువుతీర్చారు.



ప్రత్యేక అలంకారంలో కాలభైరవస్వామి

ఆంజనేయస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, జూలై 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించండి

కేవీబీపురం, జూలై 16: డయేరియా నియంత్రణకు వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని వైద్యాధికారి వాణి చెప్పారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. పరిసరాలు, వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటిని పరిశీలించారు. విద్యార్థులకు నిల్వ ఆహారాన్ని ఇవ్వవద్దని, తాజా కూరగాయలను వండి వడ్డించాలని సిబ్బందికి సూచించారు. బయట పదార్థాలను లోనికి రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ఎయిర్‌పోర్టు వద్ద వెంచర్ స్థల వివాదం

పనులను ఆపాలన్న రెవెన్యూ సిబ్బందిపై దాడి



ఏర్పేడు, జూలై 16: వెంచర్ స్థలం విషయమై వివాదం ఉండడంతో పనులు ఆపాలన్న రెవెన్యూ సిబ్బందిపై నిర్మాహకులు దాడికి పాల్పడిన ఘటన ఏర్పేడు మండల పరిధిలో మంగళవారం జరిగింది. రెవెన్యూ సిబ్బంది కథనం మేరకు వివరాలు... తిరుపతి విమానాశ్రయ సమీపంలోని గోవిందవరం పంచాయతీ జింకలమిట్ట కాలనీ వద్ద సర్వే నంబరు 6, 466లలోని సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఓ పోలీసు అధికారి బంధువులు వెంచర్ వేశారు. ఇందులో కొంత ప్రభుత్వ భూమి ఉండడంతో రెవెన్యూ అధికారులు కోర్టులో కేసు వేశారు. ఇదిలా ఉండగా వెంచర్ నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో రెవెన్యూ సిబ్బంది ఏర్పేడు తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు వివాదాస్పద స్థలంలో పనులు చేయొద్దని నిర్మాహకులకు చెప్పినా ఖాతరు చేయకపోవడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం రెవెన్యూ సిబ్బంది వెంచర్ వద్దకు వెళ్లి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో వెంచర్ నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తహసీల్దారు డ్రైవర్ నాగరాజు కిందపడడంతో ఆయన కాలుకు గాయమైంది. దీనిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దారు చెప్పారు.

బిల్లులు చెల్లించలేదని ఆర్‌బీకే భవనానికి తాళం



రైతు భరోసాకు కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 16: మండలంలోని పిల్లేటివారికండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనానికి బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ రాజయ్య మంగళవారం తాళాలు వేశారు. ఈ భవనాన్ని ఉపాధి హామీ పథకం కింద రూ.21.80లక్షలతో ఇదే గ్రామానికి చెందిన రాజయ్య నిర్మించారు. ఆయన ఇంకా బిల్లులు రావాల్సి ఉంది. టీడీపీ నాయకులు ఎమ్మెల్యే చేతులు మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించాలనే ఏర్పాట్లు చేశారు. అయితే తనకు బిల్లులు వచ్చే వరకు రైతు భరోసా కేంద్రాన్ని అప్పగించేది లేదంటూ కాంట్రాక్టర్ భవనానికి తాళాలు వేశారు. దీంతో మంగళవారం టీడీపీ, వైసీపీ వర్గీయల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. భవన ప్రారంభోత్సవాన్ని అధికారులు వాయిదా వేశారు.

వసతిగృహంలో బాలికలకు భద్రత ఏదీ..?



విద్యార్థులతో మాట్లాడుతున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 16: గురుకుల పాఠశాల వసతి గృహంలో బాలికలకు కనీస భద్రత లేకపోవడంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి ఆమె స్థానిక తెలుగుగంగ కాలనీలో ఉన్న బాలికల గురుకుల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. అక్కడ వాచ్‌మెన్ లేకపోవడం, విద్యార్థులతో బయటి వ్యక్తులు వచ్చి మాట్లాడుతుండగా ఆమె గుర్తించారు. రాత్రి వేళలో బాలికల వసతి గృహానికి వాచ్‌మెన్‌ను ఎందుకు నియమించలేదని అక్కడి అధికారులను ప్రశ్నించారు. అలాగే కొందరు బయటి వ్యక్తులు తినుబండారాలను వసతిగృహం లోపలకు తెచ్చి విక్రయిస్తున్నట్లుగా తనిఖీ సమయంలో గుర్తించారు. ఇలా బయటి వ్యక్తులను ఎందుకు అనుమతిస్తారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 20రోజుల క్రితం ఈ వసతిగృహాన్ని బృందమ్మ తనిఖీచేసి పలు సమస్యలను బహిర్గతం చేశారు. కనీసం సాంబారు లేకుండా రసంతో అన్నాన్ని సగం మంది విద్యార్థులకు పెట్టడం, మరికొందరు విద్యార్థులకు ఆ రోజు అన్నం లేకపోవడం గుర్తించారు. అలాగే మెనులో కోడిగుడ్డుతో పాటు తాజా కూరగాయాలను మాత్రమే వినియోగించుకోవాలని కోరారు. వారం రోజుల తరువాత మళ్లీ ఇదే వసతిగృహాన్ని తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో విద్యార్థుల గదుల వద్ద పందులు సంచరిస్తున్నట్లు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మళ్లీ మంగళవారం తనిఖీ చేయగా అసలు సెక్యూరిటీనే లేకపోవడం చూసి ఆవేదన చెందారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వసతిగృహంలోని ఆడబిడ్డలకు నాణ్యమైన విద్యతో పాటు పటిష్టమైన భద్రత కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

శ్రీకాళహస్తి, జూలై 16: పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని దర్గామిట్ట మలుపు బాలాజీ లైన్ వద్ద తాగునీటి పైపు లీకేజీ కావడంతో స్థానికులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే మరమ్మతులు చేయాలని పురపాలక సంఘ అధికారులను ఆదేశించారు. మంగళవారం పనులు చేపట్టి లీకేజీని అరికట్టారు. వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలూరు శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, యశ్వంత్, మునిరాజు యాదవ్, షాబుద్దీన్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

20న కనకదుర్గమ్మకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి, జూలై 16: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు ఈనెల 20వ తేదీ శనివారం సారె సమర్పించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాలను పురస్కరించుకుని సారె అందజేయనున్నట్లు చెప్పారు.

24న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, జూలై 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 24వ తేదీ బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రతినిధులు

శ్రీసిటీ, జూలై 16: శ్రీసిటీ, ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని సంస్థ సీఈవో ఇమ్మాన్యుయేల్ తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ ఉత్తీర్ణులయిన సుమారు 400 మంది జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి 150 మంది ఎంపిక చేసిన వివిధ కంపెనీలు అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందించాయి.

కాలువ పనుల అడ్డగింత



పోలీసులతో స్థానికుల వాగ్వాదం

రేణిగుంట, జూలై 16: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంటకాలువలో మురుగునీటిని బయటకు పంపించేందుకు కాలువ నిర్మాణ పనులను పంచాయతీ అధికారులు చేపట్టగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ ఘటన రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీలోని తాతయ్యకాలువ కాలనీలో మంగళవారం జరిగింది. ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మ తెలిపిన వివరాల మేరకు... తాతయ్య కాల్వ కాలనీలో మురుగుకాలువలు మూసుకుపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలోని పంట కాలువలో మురుగునీరు అధికంగా ఉండటంతో బయటకు పంపేందుకు తాత్కాలిక కాలువ నిర్మాణ పనులు చేపట్టగా స్థానికులు అడ్డుకున్నారని తెలిపారు. ఈవిషయమై రెవెన్యూ అధికారులు గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. పోలీసుల సమక్షంలో కాలువ నిర్మాణం చేపట్టామన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



ద్రౌపదీ పరిణయం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకారంలో స్వామి అమ్మవార్లు



పూజాద్రవ్యాలు తీసుకెళ్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, జూలై 16: ద్రౌపదీదేవి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఐదవ రోజైన మంగళవారం రాత్రి ద్రౌపదీ కల్యాణం కన్నుల పండువలా సాగింది. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించి ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల తలంబ్రాలను తీసుకుని భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామిని విశేషంగా అలంకరించారు. వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య మంగ సూత్రాన్ని భక్తులకు చూపించి స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఉదయం చప్పరంపై స్వామి అమ్మవార్లు పురవిహారం చేశారు.

రోడ్ల అభివృద్ధికి సహకరించండి: ఆదిమూలం



ఆదిమూలాన్ని సన్మానిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

సత్యవేడు/పిచ్చాటూరు, జూలై 16: సత్యవేడు నియోజకవర్గంలో దుస్థితిలో ఉన్న రోడ్ల అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులను ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. మంగళవారం తిరుపతిలో పంచాయతీరాజ్, రోడ్లు భవనాలశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్థాంతరంగా ఆగిపోయిన టీపీకోట రోడ్డు, రామగిరి నుంచి వాలీశ్వరాలయం వరకు రోడ్డుతో పాటు అధ్వానంగా ఉన్న పలురోడ్ల పనులను చేపట్టి త్వరితగతిన చేపట్టాలని అధికారులను కోరారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌నారాయణ, ఆర్అండ్‌బీ జిల్లా అధికారి మధుసూదన్‌రావు, డీఈలు రెడ్డెయ్య, అమర్నాథ్‌రెడ్డి, రాంబాబు, నాగమల్లయ్య, ఏఈలు ఇశ్రాయేల్, శేఖర్, నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

రేపు వరదయ్యపాళెం మండల మీట్

వరదయ్యపాళెం, జూలై 16: వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్, ఎంపీపీ పద్మప్రియ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

నేడు బస్సు సర్వీసుల ప్రారంభం

పిచ్చాటూరు, జూలై 16: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం బుధవారం మూడు ఆర్టీసీ సర్వీసులు ప్రారంభించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీరామాపురం బస్సు సర్వీసును, 10 గంటలకు నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీపీ కోట మార్గంలో రెండు బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు.

పంచాయతీల్లో తాగునీటి పరీక్షలు

రేణిగుంట, జూలై 16: రేణిగుంట మండల పరిధిలోని 19 పంచాయతీల్లో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తాగునీటి పరీక్షలు నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీ బోర్ల వద్ద తాగునీటి పరీక్షలు చేశారు. బోర్ల నుంచి నీటి సరఫరా అయ్యే ప్రధాన పైపులకు క్లోరినేషన్ పరికరాలను అమర్చారు.